


బందరుకోటలో..

వైభవంగా కృష్ణాష్టమి

కృష్ణాష్టమి వేడుకలు ఉమ్మడి కృష్ణాజిల్లా వ్యాప్తంగా సోమవారం ఘనంగా జరిగాయి. కృష్ణుడు, గోపికల వేషధారణల్లో చిన్నారులు అలరించారు. ఉట్టికొట్టి సంబరం చేసుకున్నారు. కృష్ణాష్టమిని పురస్కరించుకుని సోమవారం సాయంత్రం దుర్గగుడి రాజగోపురం ఎదురుగా ఖాళీ స్థలంలో ఉట్టికొట్టే వేడుకను నిర్వహించారు. భక్తులు, ఆలయ సిబ్బంది, అధికారులు, పోలీసులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబు, దుర్గగుడి ఈవో కె.ఎస్.రామారావు ఉట్టికొట్టారు. మచిలీపట్నం, బందరుకోట, ఎన్‌గొల్లపాలెంలో మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ బాలశౌరి పాల్గొని చిన్నారులతో ఉట్టికొట్టించారు.


ఇంద్రకీలాద్రిపై

కూర్పు సిద్ధం

జిల్లాలో ఉద్యోగుల బదిలీలకు రంగం సిద్ధం

- పంచాయతీరాజ్ విభాగంలో అధిక దరఖాస్తులు
- అంతర్ జిల్లాస్థాయి బదిలీలు ఆయా విభాగాల ఉన్నతాధికారులకు...
- బదిలీ జాబితాలకు ఒకటి, రెండు రోజుల్లో తుది రూపం

సచివాలయ ఉద్యోగుల బదిలీలకు కలెక్టర్ అనుమతి



ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత తొలి విడత బదిలీలు ఇవి. ఉద్యోగులు కూటమికి చెందిన నాయకుల ద్వారా శాసనసభ్యుల వద్దకు వెళ్లి సిఫార్సు లేఖలు తెచ్చుకున్నారు. ఉద్యోగులు తమ బదిలీ కోసం దరఖాస్తులు ఇచ్చే సమయంలో సిఫార్సు లేఖలను జతచేసి ఇచ్చారు. ఎక్కువ మంది ఉద్యోగులు బదిలీ కోసం దరఖాస్తు చేయడంతో తాము ప్రతిపాదన చేసిన ఉద్యోగులు వారు కోరుకున్న ప్రాంతానికి బదిలీ అవుతారా లేదా అనే ఉత్కంఠ కూటమికి చెందిన ద్వితీయశ్రేణి నాయకుల్లో నెలకొంది. ఐదేళ్లపాటు ఒకే ప్రాంతంలో పనిచేసిన ఉద్యోగులు తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉండగా, కొందరు ఉద్యోగులు తాము అక్కడి నుంచి కదిలేది లేదని బదిలీ కోసం దరఖాస్తు చేసుకోలేదు. దీంతో తాము ప్రతిపాదన చేసిన ఉద్యోగులకు వారుకోరుకున్న ప్రాంతాలకు బదిలీ అవుతారా? లేదా? అనే అంశంపై ద్వితీయశ్రేణి నాయకులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మచిలీపట్నం నియోజకవర్గంలో ఉద్యోగుల బదిలీలకు ఎవరైనా నాయకులు సిఫార్సు చేస్తే సంబంధిత ఉద్యోగి పనితీరుపై రెండో వ్యక్తి ద్వారా విచారణ చేయిస్తున్నారు. కొందరు కూటమి నాయకులు మీరు కోరుకున్న ప్రాంతానికి బదిలీ అవుతారని ఉద్యోగులకు అభయమిచ్చేస్తున్నారు. అయితే అధికారులు తుది జాబితాలు తయారు చేసే సమయంలో ఎలాంటి మార్పులు జరుగుతాయోనని భయం ఉద్యోగులను వెంటాడుతోంది.

> జిల్లాలో ఉద్యోగుల బదిలీలకు రంగం సిద్ధమైంది. వరుసగా రెండు రోజులపాటు సెలవులు రావడంతో జాబితాల తయారీలో కొంత ఆలస్యమైనా మంగళవారం మధ్యాహ్నానికి బదిలీల జాబితాలు సిద్ధమవుతాయని జిల్లా అధికారులు చెబుతున్నారు. కొందరు శాసనసభ్యుల కార్యాలయాల నుంచి ఇంకా బదిలీలకు ప్రతిపాదనలు అందకపోవడంతో కొన్ని విభాగాల్లో జాబితాలు పూర్తిస్థాయిలో ఆయా కార్యాలయాల్లో తయారు చేయలేదు. అన్ని దరఖాస్తులూ వచ్చాక బదిలీల తుది జాబితాలను తయారుచేసి కలెక్టర్‌కు పంపుతామని అధికారులు చెబుతున్నారు.

పంచాయతీరాజ్ విభాగంలో దరఖాస్తుల వెల్లువ

పంచాయతీరాజ్ విభాగంలో సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, గ్రేడ్ -1 నుంచి గ్రేడ్-4 పంచాయతీ కార్యదర్శులు, ఇతర విభాగాల్లో పనిచేసే ఉద్యోగులు పెద్దఎత్తున బదిలీల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. ఆయా విభాగాల్లో బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్న వారి పూర్తిస్థాయి వివరాల ఆధారంగా జాబితాలను కార్యాలయ అధికారులు సిద్ధం చేశారు. ఉద్యోగులు బదిలీ కోసం చేసుకున్న దరఖాస్తులతో పాటే శాసనసభ్యుల నుంచి సిఫార్సు లేఖలు తెచ్చుకుంటే వాటిని కూడా జతచేసి జాబితాలను సిద్ధంగా ఉంచారు. అంతర్ జిల్లాలకు బదిలీకోసం దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులు జాబితాలను సిద్ధం చేసి పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయానికి పంపారు. గుడివాడ, గన్నవరం, పామర్రు తదితర నియోజకవర్గాల నుంచి పంచాయతీరాజ్ విభాగంలో బదిలీల కోసం దరఖాస్తులు చేసుకున్న ఉద్యోగుల జాబితాలు దాదాపు సిద్ధమయ్యాయి. మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఉద్యోగుల బదిలీల జాబితాలు ఇంకా బయటకు రాలేదని ఉద్యోగులు చెప్పుకుంటున్నారు. 72 మంది జాబితాలు మంగళవారం ఆయా కార్యాలయాలకు అందుతాయని ఉద్యోగులు చెప్పుకుంటున్నారు.

ఒకటి, రెండు రోజుల్లో కలెక్టర్‌కు తుది జాబితాలు

ఉద్యోగుల బదిలీలకు జీరో సర్వీసును ఆధారంగా చేసుకుని బదిలీలకు దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఇవ్వడంతో అధికశాతం ఉద్యోగులు తాము కోరుకున్న ప్రాంతాలకు బదిలీపై వెళ్లేందుకు ఇబ్బడి ముబ్బడిగా దరఖాస్తులు చేసుకున్నారు. కనీసంగా రెండు సంవత్సరాలపాటు ఒకే ప్రాంతంలో పనిచేసేవారికి బదిలీకోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఇస్తే, ఇంత పెద్దమొత్తంలో దరఖాస్తులు వచ్చి ఉండేవి కావని అధికారులు అంటున్నారు. ఏదిఏమైనా వచ్చిన దరఖాస్తులతోపాటు శాసనసభ్యుల నుంచి ఉద్యోగులు తెచ్చుకున్న సిఫార్సు లేఖలను జతపరచి జాబితాలను సిద్ధం చేశామని, ఈ జాబితాలను మంగళ, బుధవారాల్లో కలెక్టర్‌కు పంపుతామని, ఆ తరువాత ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది తమ చేతుల్లో లేదని జిల్లాస్థాయి అధికారులు అంటున్నారు.

సచివాలయ ఉద్యోగుల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్

జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. సచివాలయ ఉద్యోగులు బదిలీల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు కలెక్టర్ అనుమతులు ఇచ్చారు. ఈనెల 30, 31 తేదీల్లో సచివాలయ ఉద్యోగులకు వెబ్‌కౌన్సెలింగ్ ద్వారా బదిలీలను నిర్వహిస్తామని అధికారులు చెబుతున్నారు.


కలెక్టరేట్

రెవెన్యూ వ్యవస్థ గందరగోళం

కొత్త జిల్లాలకు కొత్త సిబ్బందిని ఇవ్వని గత ప్రభుత్వం

- పాత కలెక్టరేట్ సెక్షన్లలోని సిబ్బంది విభజన
- 8 సెక్షన్లకుగాను 3, 4 సెక్షన్లకే సిబ్బంది
- మిగిలిన సెక్షన్ల భారం కూడా ఉన్నవారిపైనే
- తహసీల్దార్ కార్యాలయాలకు నిధుల కొరత
- ఆర్డీవో కార్యాలయాల్లో సిబ్బంది లేమి

జిల్లాల పునర్విభజన పేరుతో కిందటి వైసీపీ ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను అతలాకుతలం చేసింది. కొత్త జిల్లాలను ఏర్పాటు అయితే చేసింది కానీ.. జిల్లాలకు తగినట్టుగా సిబ్బందిని ఇవ్వకపోవటంతో రెవెన్యూ సిబ్బంది పనిభారంతో అల్లాడిపోతున్నారు. కలెక్టరేట్లు మొదలు కొని ఆర్డీవో కార్యాలయాలు, తహసీల్దార్ కార్యాలయాల వరకు సిబ్బంది కొరత, నిధుల లేమి, మౌలిక సదుపాయాల కల్పన లేమి, సాంకేతిక సమస్యలతో సతమతమవుతున్నారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేస్తుందని ఉద్యోగులు కొండంత ఆశతో ఎదురుచూస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఉమ్మడి జిల్లా కలెక్టరేట్లలో పనిచేసే సిబ్బందినే విభజించి పంచటం వల్ల ఎన్టీఆర్, కృష్ణా కలెక్టరేట్లలో సిబ్బంది కొరత ఏర్పడింది. కొత్త జిల్లాలకు, పాత విభజిత జిల్లాల కలెక్టరేట్లకు సిబ్బందిని పంచటం వల్ల పలు సెక్షన్లను కుదించాల్సిన పరిస్థితి ఏర్పడింది. పాత జిల్లా కలెక్టరేట్ సిబ్బందినే కొత్త జిల్లాలకు సర్దుబాటు చేయటం వల్ల రెవెన్యూ ఉద్యోగులపై తీవ్రమైన పనిభారం నెలకొంది. కొత్త జిల్లాలు ఏర్పడినప్పటికీ ఆయా సెక్షన్ల పనివిధానాల్లో ఏమైనా మార్పులు వస్తాయా అంటే అలాంటివేమీ ఉండవు. సెక్షన్లు తగ్గింపు అనేది ఉండదు. ఉన్న సెక్షన్ల ప్రకారం ఉద్యోగులు పనిచేస్తేనే జిల్లా పాలన సవ్యంగా సాగుతుంది. కలెక్టరేట్లలో గతంలో ఉన్న విధంగా 8 సెక్షన్లకు సరిపడా సిబ్బందిని నియమించి ఉన్న సిబ్బందిపై పనిభారం లేకుండా చేస్తే జిల్లా పాలన సవ్యంగా నడిచిపోతుంది

తహసీల్దార్ కార్యాలయాల పరిస్థితి దయనీయం

జిల్లాల పునర్విభజన తర్వాత తహసీల్దార్ కార్యాలయాల పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. తహసీల్దార్ కార్యాలయాలకు కిందటి ప్రభుత్వ హయాంలో రోజువారీ ఖర్చులకు సరిపడా నిధులు వచ్చేవి కావు. ప్రస్తుతం కూడా పరిస్థితి ఇలాగే ఉంది. నిధులు లేకపోవటం వల్ల కార్యాలయ నిర్వహణ సక్రమంగా జరగటం లేదు. కార్యాలయ అవసరాల కోసం నిర్వహిస్తున్న అద్దె వాహనాలకు సరిపడా నిధులు కూడా రావటం లేదు. ఇవన్నీ ఒకఎత్తు అయితే ప్రొటోకాల్ పేరుతో అదనపు ఖర్చులు పెట్టాల్సి వస్తోంది. ప్రొటోకాల్ ఖర్చుల కోసం సరిపడా నిధులు కూడా ఇవ్వలేని పరిస్థితి ఏర్పడుతోంది. తహసీల్దార్ కార్యాలయాల పరిధిలో అనేక కోర్టు కేసులు కూడా నడుస్తున్నాయి. ఈ కోర్టు కేసుల పరిష్కారానికి సరిపడా నిధుల కేటాయింపు కూడా ఉండటం లేదు. తహసీల్దార్ కార్యాలయంలో ఉపయోగించే కంప్యూటర్లు ఏనాడో మూలనపడ్డాయి. సొంత ఖర్చులతో కొనుగోలు చేశారు. వీటికి ఇంటర్నెట్ సౌకర్యం కూడా సొంతంగా ఏర్పాటు చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. తహసీల్దార్ కార్యాలయాల ఉద్యోగులకు టాయ్‌లెట్లు కూడా లేవు.

ఆర్డీవో కార్యాలయాలలోనూ ఇదే దుస్థితి

ఉమ్మడి జిల్లాలో మొత్తం ఆరు రెవెన్యూ డివిజినల్ కార్యాలయాలు ఉన్నాయి. వీటన్నింట్లోనూ సిబ్బంది కొరత పీడిస్తోంది. ఆర్డీవో కార్యాలయాల్లో తగినంత మంది సిబ్బంది లేకపోవటంతో. ప్రజల అర్జీలను త్వరితగతిన పరిష్కరించలేని పరిస్థితి ఏర్పడుతోంది. ఆర్డీవో కార్యాలయాలను కూడా నిర్వహించటం భారంగా మారుతోంది. కార్యాలయాల నిర్వహణ కోసం ఖర్చులు ఇవ్వకపోవటంతో ఈ పరిస్థితి ఏర్పడింది.

ఎలక్ట్రిక్ షాక్

రెండు జిల్లాల్లో పడిపోయిన ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాలు

- ఫేమ్-2 ఎత్తివేత, రోడ్డు ట్యాక్స్ అదనపు భారం వల్లే..
- ఈఎంపీఎస్ కొనసాగుతున్నా గణనీయంగా తగ్గిన రాయితీ
- ధరలు తగ్గే వరకు వేచిచూసే యోచనలో వాహనదారులు

రవాణా రంగ రాజధాని విజయవాడలో ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాలు పడిపోతున్నాయి. వాతావరణాన్ని దెబ్బతీయని వాహన వ్యవస్థ అందుబాటులోకి వచ్చినా వినియోగం తక్కువగా ఉండటంతో ఈ రంగం అసాధారణ కుదుపునకు గురవుతోంది. కేంద్ర ప్రభుత్వం సబ్సిడీలు ఎత్తేయడం, రాష్ట్రంలో రోడ్డు ట్యాక్స్ అదనపు భారంతో కొద్దినెలలుగా రెండు జిల్లాల్లో అమ్మకాలు భారీగా పడిపోయాయి.



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రెండు జిల్లాల్లో ఎనిమిది నెలలుగా ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీలు) అమ్మకాలు తగ్గడం ఆందోళన కలిగిస్తోంది. ధరలు అందుబాటులో లేకపోవటమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. పెట్రోల్ ఆధారిత ద్విచక్రవాహనాల కంటే ఈవీల ధరలు రూ.అరలక్ష, ఆపైన ఎక్కువగా ఉంటున్నాయి. పెట్రోల్ వాహనాలతో పోలిస్తే నిర్వహణ వ్యయం తక్కువే అయినా అంత మొత్తం పెట్టి కొనే స్థోమత లేనివారు ఈవీలవైపు చూడట్లేదు. కంపెనీలు కొంతవరకు తగ్గింపు రాయితీలు ఇస్తున్నా ప్రభావితం చూపట్లేదు. చిన్న, మధ్య తరహా ఈవీ ద్విచక్రవాహనాల విషయంలో ఈ సమస్య పెద్దగా లేకున్నా, మైలేజీ 140 నుంచి 180 కిలోమీటర్ల వరకు ఉండే హై ఎండ్ ద్విచక్రవాహనాల విషయంలో ఎక్కువగానే ఉంది. నూటికి 90 శాతం మంది ఈ హైఎండ్ మైలేజ్ రేంజ్ వాహనాలనే కోరుకుంటున్నారు. వీటి ధర రూ.లక్షన్నర నుంచి రూ.1.80 లక్షల వరకు ఉంది. అదే పెట్రోల్ ద్విచక్రవాహనమైతే రూ.లక్ష, అంతకంటే తక్కువ ధరకే లభిస్తోంది.

ఎందుకిలా..?

ఈవీల అమ్మకాలు తగ్గడానికి రెండు ప్రధాన కారణాలున్నాయి. వీటి ప్రోత్సాహనికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫేమ్-2 పథకం గడువు ముగియడం ఒక కారణమైతే, ఇంకా ఫేమ్-3 పథకాన్ని అమల్లోకి తీసుకురాకపోవడం మరొకటి. ఫేమ్-3 అక్టోబరు నుంచి అందుబాటులోకి వస్తుందంటున్నారు కానీ, స్పష్టత లేదు. ఫేమ్-2 వల్ల ద్విచక్ర వినియోగదారుడికి రూ.21 వేల నుంచి రూ.25 వేల వరకు ప్రయోజనం కలిగేది. ప్రస్తుతం ఫేమ్-2 అమల్లో లేదు. అయితే, కేంద్రం ఎలక్ట్రిక్ మొబిలిటీ ప్రమోషన్ స్కీమ్ (ఈఎంపీఎస్)ను అమలు చేస్తోంది. ఫేమ్-2 భారాన్ని తగ్గించుకునేందుకే కేంద్రం ఈఎంపీఎస్‌ను అమలు చేస్తోందన్న విమర్శలు వస్తున్నాయి. ఈఎంపీఎస్ కింద రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు మాత్రమే రాయితీ వస్తుంది. అలాగే, రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వం లైఫ్ ట్యాక్స్‌ను మోపటం వల్ల రూ.లక్ష విలువ కలిగిన వాహనంపై 12 శాతం అంటే రూ.12 వేల చొప్పున పన్ను భారం పడింది. ఆ తర్వాత ఈవీ మార్కెట్ నుంచి వచ్చిన డిమాండ్‌తో జూలై వరకు లైఫ్ ట్యాక్స్‌ను ఉపసంహరించుకున్నారు. ఈ గడువు ముగిసింది. ప్రస్తుతం రోడ్డు ట్యాక్స్ విధిస్తున్నారు. దీనివల్ల ద్విచక్ర ఈవీ కొనుగోలుపై రూ.12 వేల నుంచి రూ.18 వేల వరకు భారం పడుతోంది. ఈ మొత్తం కారణాల వల్ల ఒక్కో ఈవీపై గరిష్ఠంగా రూ.43 వేల చొప్పున భారం పడుతోంది.

కొనుగోళ్లకు బ్రేక్

ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఈవీలకు సంబంధించి ఆథరైజ్డ్ డీలర్లు 15 మంది వరకు ఉన్నారు. టీవీఎస్, హీరో, బజాజ్ వంటి పెట్రోల్ వాహనాల డీలర్లే తమ షోరూమ్‌లలో ఈవీలను విక్రయిస్తున్నారు. వీరుకాకుండా రిజిస్టర్డ్ కంపెనీలైన ఓలా, ఏథర్, అవేరా, ఒకినోవా, ఒకాయో, క్వాంటమ్, గోదావరి, న్యూమరస్, బౌన్స్, బిగాస్ వంటి పలు సంస్థలు షోరూమ్‌లు ఏర్పాటు చేశాయి. ఉమ్మడి జిల్లాలో రిజిస్టర్డ్, అన్ రిజిస్టర్డ్ షోరూమ్‌లు 50 వరకు ఉన్నాయి. రిజిస్టర్డ్ షోరూమ్‌లలో నెలకు 20 నుంచి 30 వరకు ఎలక్ట్రానిక్ వాహనాలను విక్రయించేవారు. కేంద్ర ప్రభుత్వ ఫేమ్-2 పథకం ఎత్తివేత, రోడ్డు ట్యాక్సుల కారణంగా ప్రస్తుతం నెలకు 5 నుంచి 10లోపే విక్రయాలు జరుగుతున్నాయి. దీనిని బట్టి సగం కంటే ఎక్కువగానే కొనుగోళ్లు పడిపోయాయని తెలుస్తోంది.

మళ్లీ పెరిగే అవకాశముందా..?

వాతావరణ సమతౌల్యంలో భాగంగా ఈవీలను ప్రోత్సహిస్తామని ప్రభుత్వాలు చెబుతుండటం వల్ల రోడ్డు ట్యాక్స్‌ను కచ్చితంగా ఎత్తివేస్తాయని వాహనదారులు భావిస్తున్నారు. తెలంగాణ, ఢిల్లీ, కర్నాటక, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్, చత్తీస్‌గఢ్, అస్సోం వంటి రాష్ట్రాల్లో ఆయా ప్రభుత్వాలు రూ.10 వేల వరకు సబ్సిడీ ఇస్తున్నాయి. మన రాష్ట్రంలో కూడా త్వరలో రాయితీలతోపాటు రోడ్డు ట్యాక్స్ ఎత్తివేస్తారని ఎదురుచూస్తున్నారు. రాయితీలు అమల్లోకి రాగానే ఈవీల విక్రయాలు అమాంతం పెరిగే అవకాశం కనిపిస్తోంది.


అధ్వానంగా ఉన్న గుడివాడ-విజయవాడ రహదారి


అదుపు తప్పి బోల్తా పడిన ఆటో (ఫైల్)

గుడివాడ-కంకిపాడు రహదారికి మోక్షం

మరమ్మతుల కోసం టెండర్ల ప్రక్రియ పూర్తి

- మూడు ప్యాకేజీలుగా విభజన
- రెండు ప్యాకేజీలకు టెండర్లు ఖరారు

విజయవాడ రావాలంటే గుడివాడ చట్టుపక్కల గ్రామాలకు, ఉభయ గోదావరి జిల్లాలవాసులకు గుడివాడ-కంకిపాడు రహదారే దిక్కు. ఈ రోడ్డు ఛిద్రమవడంతో ప్రయాణించాలంటే జనం భయపడుతున్నారు. గత వైసీపీ పాలనలో కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రమాదాల బారినపడి అనేక మంది మృత్యువాతపడ్డారు. కూటమి ప్రభుత్వం ఈ రహదారి మరమ్మతులపై దృష్టి పెట్టింది. రెండు ప్యాకేజీల టెండర్ల ఖరారు చేసింది. త్వరలో పనులు జరగనున్నాయి.

గుడివాడ : 2014-19 కాలంలో టీడీపీ హయాంలో గుడివాడ-కంకిపాడు రహదారి అభివృద్ధికి నిధులు వచ్చాయి. 23 కిలోమీటర్ల మేర రహదారికి ఇరువైపులా మీటరు వెడల్పుతో పాటు మరమ్మతులకు నిధులు విడుదలయ్యాయి. 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడంతో అప్పటి మంత్రి కొడాలి నాని పక్కదారి పట్టించి గుడివాడ పట్టణంలోని పెదకాలువ సెంటర్ నుంచి నియోజకవర్గ సరిహద్దు వరకు రహదారి వేయించారు. రహదారి ఛిద్రమైన చోటగానీ, ప్రమాదాలు జరిగే చోటగానీ పనులు జరిగిన దాఖలాలు లేవు. వైసీపీ పాలనలో పైసా నిధులు కూడా విడుదల కాకపోవడంతో రహదారి మరింత ప్రమాదకరంగా మారింది. గత ఐదేళ్ల వ్యవధిలోనే ప్రమాదాల బారినపడి సుమారు 50 మంది మృతి చెందినట్టు సమాచారం. వందల సంఖ్యలో గాయాలపాలయ్యారు. అయినా గత పాలకులు కనికరం చూపలేదు.

నాలుగు నియోజకవర్గాల రహదారి

గుడివాడ, పామర్రు, గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల నుంచి 23 కిలోమీటర్ల మేర ఈ రహదారి ఉంటుంది. 2024 ఎన్నికల్లో నాలుగు నియోజకవర్గాల్లోనూ టీడీపీ విజయఢంకా మోగించింది. దీంతో రహదారికి మహర్దశ పడుతుందని ప్రయాణికులు ఆశిస్తున్నారు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావడంతో ప్రధానంగా రహదారుల మరమ్మత్తులపై దృష్టి సారించింది.

మూడు ప్యాకేజీలుగా విభజన

23 కిలోమీటర్ల మరమ్మతుల నిమిత్తం ఆర్ అండ్ బీ అధికారులు పెదపారుపూడి మండలం భూషణగుళ్ల నుంచి వెంట్రప్రగడ, వెంట్రప్రగడ నుంచి నందమూరు, నందమూరు నుంచి కంకిపాడు వరకు మూడు ప్యాకేజీలుగా విభజించారు. మొదటి ప్యాకేజీలో మరమ్మతుల నిమిత్తం రూ.5 కోట్లు, మూడో ప్యాకేజీలో రూ.1.70 కోట్లతో టెండరు ప్రక్రియ పూర్తి అయింది. త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయి. రెండో ప్యాకేజీలో మరమ్మతుల నిమిత్తం అంచనాలు పూర్తయి పరిపాలన అనుమతుల కోసం వెళ్లాయి.

జనసైనికుడిపై వైసీపీ మూక దాడి

- వైసీపీ పాలనపై గ్రామసభలో నిలదీత
- అదనుచూసి దాడిచేసిన జోగి అనుచరులు
- కంచడంలో ఉద్రిక్తత

6లో

వైసీపీ మూక దాడి!

» జనసైనికుడికి తీవ్ర గాయాలు
» వైసీపీ పాలనపై గ్రామసభలో నిలదీసినందుకు అదునుచూసి దాడి
» నిందితులు మాజీ మంత్రి జోగి అనుచరులు » కంచడంలో ఉద్రిక్తత


తీవ్ర గాయాలతో పిన్నెంటి రవిబాబు

బంటుమిల్లి, ఆగస్టు 26 : కంచడం గ్రామంలో కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా అన్నసమారాధనలో ఇరువురి మధ్య వివాదం ఘర్షణకు దారితీసింది. గ్రామానికి చెందిన జనసైనికుడు పిన్నెంటి రవిబాబు(41)పై అదే గ్రామానికి చెందిన సర్పంచ్ బందారు చంద్రశేఖర్, పీఏసీఎస్ మాజీ ఛైర్మన్ గంధం శేషగిరి, అతడి కుమారుడు మణికంఠసాయిలు దాడి చేయడంతో తీవ్ర గాయాలై ఆసుపత్రి పాలయ్యాడు. దీంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇటీవల జరిగిన గ్రామసభలో జనసైనికుడు పిన్నెంటి రవిబాబు ప్రశ్నించినందుకు మనసులో పెట్టుకుని ఈ దాడి జరిగినట్టు భావిస్తున్నారు. గ్రామసభలో గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఏం చేసిందని, పీఏసీఎస్‌లో జరిగిన అవకతవకలు ప్రజలందరికీ తెలియాలని పిన్నెంటి రవిబాబు డిమాండ్ చేశారు. దీనిని మనసులో పెట్టుకున్న వైసీపీ నాయకులు సోమవారం కృష్ణాష్టమి అన్నసమరాధ కార్యక్రమానికి వచ్చిన పిన్నెంటి రవిబాబుపై మాజీ మంత్రి జోగి రమేశ్ అనుచరులు బందారు చంద్రశేఖర్, గంధం శేషగిరి, గంధం మణికంఠసాయి దాడి చేశారు. రవిబాబుకు తీవ్ర గాయాలుకాగా మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేయాల్సి ఉంది.


సుజనా మాతృమూర్తి సుశీలకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రజాప్రతినిధులు

సుజనాచౌదరి మాతృమూర్తి జన్మదినం

» హాజరైన కూటమి ప్రజాప్రతినిధులు

కంచికచర్ల, ఆగస్టు 26 : కేంద్ర మాజీ మంత్రి, విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే యలమంచిలి సుజనా చౌదరి మాతృమూర్తి యలమంచిలి సుశీల 90వ జన్మదిన వేడుకలను సోమవారం వీరులపాడు మండలం పొన్నవరం గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వగృహంలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో సుజానా చౌదరి పాల్గొన్నారు. అనంతరం కేక్ కట్ చేయించారు. వేడుకల్లో విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, నెట్టెం రఘురామ్, కొనకళ్ల నారాయణ, ఎమ్మెల్యేలు శ్రీరాం తాతయ్య, వసంత కృష్ణ ప్రసాద్, కొలికిపూడి శ్రీనివాసరావు, బోడె ప్రసాద్, బుద్దా వెంకన్న, నాగుల్‌మీరా, జలీల్‌ఖాన్, బొమ్మసాని సుబ్బారావు తదితరులు పాల్గొని సుశీలకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ క్రాప్ నమోదులో జాప్యం నివారించాలి

» ఏపీ కౌలు రైతుల సంఘం

అజిత్‌సింగ్‌నగర్, ఆగస్టు 26 : ప్రభుత్వం ఈ క్రాప్ నమోదు ప్రక్రియ ప్రారంభించి, పంట వేసిన ప్రతి రైతును నేరుగా వెళ్లి నమోదు చేస్తామని ప్రకటించినా నమోదు కార్యక్రమం సజావుగా సాగటంలేదని ఏపీ కౌలు రైతుల సంఘం అధ్యక్షుడు వై.రాధాకృష్ణ, కార్యదర్శి ఎం.హరిబాబులు తెలిపారు. సోమవారం వారు మీడియాతో మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఈ క్రాప్ నమోదు వలన రైతులకు అన్ని రకాలుగా ఉపయోగపడుతుందని చెబుతున్నా నమోదులో జాప్యాన్ని నివారించాలని కోరారు. పంట నమోదుకు సంబంధిత అధికారులు వెళ్లినప్పుడు యాప్ సరిగా పని చేయకపోడం, మహిళా ఉద్యోగులు ఫీల్డ్‌లోకి వెళ్లడానికి సరైన సౌకర్యాలు లేకపోవడం, రీ సర్వే అయిన గ్రామాలలో ల్యాండ్ డేటా యాప్‌లో పూర్తిగా రాకపోవడం లేదా చాలా తక్కువ విస్తీర్ణం చూపిండం వంటి సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. ఈ క్రాప్ నమోదయ్యే వరకు ముఖ్యంగా వీఆర్వో, వీఏఎస్‌లు పూర్తి సహకారం ఇవ్వాలన్నారు.

సుబ్బారాయుడి సన్నిధిలో వండర్ బేబీ..



మోపిదేవి: మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని నోబుల్ వరల్డ్ రికార్డు చిన్నారి కుటుంబసభ్యులు సోమవారం దర్శించుకున్నారు. కొల్లూరి శ్రీకాంత్-ప్రవల్లిక దంపతుల చిన్నారి కైరా అన్నప్రాసన కార్యక్రమం స్వామి సన్నిధిలో నిర్వహించారు. అనంతరం మొక్కుబడులు చెల్లించుకున్నారు. మూడు నెలల వయస్సులో చిన్నారి కైరా వివిధ రకాల పండ్లు, జంతువులు, వస్తువులు, పక్షులు, 80 ఫ్లాష్ కార్డులు గుర్తించి నోబుల్ వరల్డ్ రికార్డు కైవసం చేసుకున్నట్టు కుటుంబసభ్యులు తెలిపారు.

రాష్ట్ర సబ్‌జూనియర్ బ్యాడ్మింటన్‌లో ఉమ్మడికృష్ణా సత్తా



విజయవాడ స్పోర్ట్సు : భీమవరం జిల్లాలో ఈ నెల 22 నుంచి 25 వరకు జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ అండర్-17 బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో ఉమ్మడి కృష్ణా ప్లేయర్స్ సత్తాచాటి పతకాలు సాధించినట్టు కేడీబీఏ అధ్యక్ష, ఉపాధ్యక్షులు పి.అంకమ్మ చౌదరి, బోడపాటి లక్ష్మీనారాయణ, కార్యదర్శి పర్సా శ్రీనివాసరావులు తెలిపారు. బాలికల సింగిల్స్‌లో ఎం.హాసినాశ్రీ, వై రేణు శ్యామలరావు(విజయనగరం)పై 21-19, 21-1తో జయభేరి మోగించి టైటిల్‌ను వశం చేసుకుంది. డబుల్స్ విజేతగా ఎం.హసీనా శ్రీ, కె గగనశ్రీలు వై హిమబిందు, వై.రేణుశ్రీ(విజయనగరం)పై హోరాహోరీ పోరులో 21-16, 15-21, 22-20తో టైటిల్‌ను ఖాతాలో వేసుకున్నారు.

ప్రశ్నాపత్రం లీక్ అయితే క్రిమినల్ చర్యలు

» ఎన్టీఆర్ జిల్లా పాఠశాల విద్యాశాఖ అధికారి సుబ్బారావు

వన్‌టౌన్, ఆగస్టు 26 : ఎన్టీఆర్ జిల్లాలో ఈనెల 27వ తేదీ నుంచి ప్రారంభం కానున్న 1 నుంచి 10వ తరగతి వరకు సెల్ఫ్ అసిస్మెంట్ మోడల్ పేపర్ - 1 పరీక్షా పత్రం లీక్ అయితే క్రిమినల్ చర్యలు తప్పవని ఎన్టీఆర్ జిల్లా పాఠశాల విద్యాశాఖ అధికారి ఎం.వి. సుబ్బారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రశ్నా పత్రాలను ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలో జిల్లా కామన్ ఎగ్జిమినేషన్ బోర్డు (డిసిఈబి) ద్వారా అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ పరీక్షల పర్యవేక్షణకు మండల స్థాయిలో ఐదుగురితో కూడిన కమిటీ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కమిటీలో ఎంఈవో 1, 2, ముగ్గురు సీనియర్ హెచ్‌ఎంలు ఉంటారని, పరిక్ష ప్రారంభానికి ఒక గంట ముందు మాత్రమే పాఠశాలలకు ప్రశ్నాపత్రాలు అందించటం జరుగుతుందని పేర్కొన్నారు. ఒకటి నుంచి 8వ తరగతి వరకు ఓఎంఆర్ పైన విద్యార్థులు సమాధానం ఇవ్వాలని, 9, 10వ తరగతి విద్యార్థులు ఆన్సర్ షీట్ పైనే రాయాలన్నారు. జిల్లాలోని ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు తగు జాగ్రత్తలతో పరీక్షలు నిర్వహించాలని సుబ్బారావు ఒక ప్రకటనలో ఆదేశించారు.

హోమియో కళాశాలలో పీజీ కోర్సులకు అనుమతి

గుడివాడ : గురురాజు ప్రభుత్వ హోమియో కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను పీజీ కోర్సులకు జాతీయ హోమియో మండలి ఉత్తర్వులను జారీ చేసినట్టు ప్రిన్సిపాల్ రమాదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వసతుల లేమి, ప్రొఫెసర్‌ల కొరతతో కళాశాల్లో 24 పీజీ కోర్సు సీట్లను ఎన్.సి.హెచ్ రద్దు చేసిన విషయం విదితమే. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రాము దృష్టికి తీసుకువెళ్లగా జాతీయ హోమియో మండలి అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించి, తిరిగి పీజీ సీట్లను సాధించారన్నారు. ఎమ్మెల్యే కృషిని పలువురు అభినందించారు.


రేపు మినీ జాబ్‌మేళా

గుడివాడ : స్థానిక పామర్రు రోడ్డులోని వరుణ్ మోటార్సులో ఈ నెల 28వ తేదీన మినీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు జిల్లా ఉపాధి కల్పన అధికారి దేవరపల్లి విక్టర్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 10వ తరగతి, ఐటీఐ, డిప్లొమో, ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన 18 నుండి 30 ఏళ్ల లోపు నిరుద్యోగులు పూర్తి బయోడేటా, ధృవపత్రాలు, జిరాక్స్ కాపీలు, ఆధార్ కార్డుతో నేరుగా హాజరు కావాలని తెలిపారు. ఎంపికైన వారికి రూ.12వేలు నుంచి రూ.20వేల వరకు వేతనం లభిస్తుందని, ఆసక్తిగల అభ్యర్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఎన్‌సిఎస్.జివోవి.ఇన్ వెబ్‌సైట్‌లో వివరాలను నమోదు చేసుకోవాలని విక్టర్‌బాబు కోరారు.

అసాంఘికాలకు అడ్డా.. హిల్‌టాప్ గెస్ట్‌హౌస్

» ముంబయి సినీ నటి వివాదంతో వెలుగులోకి వైసీపీ అక్రమాలు » ఉలిక్కిపడిన అధికారులు

ఇబ్రహీంపట్నం : ఎన్టీటీపీఎస్ హిల్‌టాప్ గెస్ట్‌హౌస్‌లో ఇటీవల వెలుగుచూసిన ఘటన తీవ్ర దుమారం రేపుతోంది. అసాంఘిక కార్యకలాపాలకు హిల్‌టాప్ గెస్టుహౌస్ నిలయంగా మారిందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ముంబాయికి చెందిన సినీనటిని ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన పారిశ్రామికవేత్త కుమారుడి ప్రేమ వ్యవహారం బెడిసికొట్టడంతో ఆమెను ఇక్కడి గెస్టుహౌస్‌కు రప్పించి 18 రోజుల పాటు వేధింపులకు గురిచేసినట్టు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో ఓ ఐపీఎస్ స్థాయి అధికారి కీలక భూమిక పోషించాడు. గత వైసీపీ ప్రభుత్వంలో ఉన్నతాధికారుల అండతో పలువురు వైసీపీ శ్రేణులు ఈ గెస్టుహౌస్‌లో పాగావేసి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినట్టు సమాచారం. ముంబాయి నటి చిత్ర హింసల విషయం 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'లో ప్రసారం కావడంతో ఎన్టీటీపీఎస్ అధికారులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. గెస్టుహౌస్‌కు పరుగులు పెట్టి రికార్డులు, సీసీ ఫుటేజ్‌లు పరిశీలించారు. అయితే రికార్డులు, సీసీ ఫుటేజ్‌లు సరిగ్గా లేవని గుర్తించి అధికారులను ప్రశ్నించగా వైసీపీ ప్రభుత్వంలో సీఎంవో కార్యాలయం నుంచి ఒత్తిడి వల్లే అలా చేయాల్సి వచ్చిందనే సమాధానం వినిపిస్తోంది. ఈ ప్రాంతానికి చెందిన ఓ మాజీమంత్రి అధికారంలో ఉండగా గెస్టుహౌస్‌ను ఇష్టానుసారంగా వాడుకున్నట్టు ఆరోపణలు వస్తుండటంతో ఎన్టీటీపీఎస్ అధికారులు దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించారు.


ఎన్టీటీపీఎస్ హిల్‌టాప్ గెస్ట్‌హౌస్

ఆలయ భూముల అన్యాక్రాంతంపై.. వాస్తవాలు ప్రకటించండి

» 'ఆంధ్రజ్యోతి' కథనాలపై ఈవో పేరుతో సోషల్ మీడియాలో ప్రకటన హల్‌చల్
» అధికారుల అస్పష్ట వివరణ

నందిగామ : పట్టణంలోని రామలింగేశ్వరస్వామి ఆలయభూముల అన్యాక్రాంతంపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'ఆలయ భూముల హాంఫట్' కథనంపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తుండగా, దేవదాయ శాఖ అధికారులు తప్పులను కప్పిపుచ్చుకొనే పనిలోపడ్డారు. సోషల్ మీడియాలో ఈవో పేరుతో ఓ వివరణ చక్కర్లు కొడుతోంది. పట్టణంలో అంతర్భాగంగా ఉన్న 55 ఎకరాల స్వామివారి ఆలయ భూమిని దీర్ఘకాలిక లీజుకు ఇచ్చే ఆలోచన లేదని ఈవో పేరుతో సదరు ప్రకటనలో పేర్కొన్నారు. స్వయంగా డిప్యూటీ కమిషనరే పట్టణంలో ఉన్న భూములను దీర్ఘకాలిక లీజులకు ఇస్తామంటూ ప్రకటించారు. దీనిపై డిప్యూటీ కమిషనర్ వివరణ ఇవ్వాల్సి ఉండగా, ఈవో వివరణ ఇవ్వడం సరికాదని ప్రజలు భావిస్తున్నారు.

ఎన్నికల ముందు వైసీపీ ప్రభుత్వం సదరు భూములను దీర్ఘకాలిక లీజుల పేరుతో అన్యాక్రాంతానికి ప్రయత్నించింది. కానీ అప్పటికే వ్యవసాయానికి గాను లీజు వేలం నిర్వహించి ఉండటంతో ప్రక్రియకు బ్రేక్ పడింది. ప్రభుత్వం మారిన తరువాత వైసీపీ పాలకుల పాత్రను అధికారులే పోషిస్తు.. ఈవో స్థాయి అధికారితో ప్రకటన ఇప్పించి చేతులు దులుపుకొనే ప్రయత్నం చేస్తున్నట్టు ప్రజలు భావిస్తున్నారు.

పారువేట మండప స్థలం వివాదం..

పారువేట మండప స్థలం విషయమై అధికారుల వివరణ హాస్యాస్పదంగా ఉంది. అక్రమ నిర్మాణంపై ప్రశ్నించగా, తాము 11 ఏళ్లకు ఖాళీ చేసే విధంగా లీజుదారుడి నుంచి అఫిడవిట్ తీసుకున్నామంటూ ప్రకటనలో పేర్కొన్నారు. వాస్తవానికి లీజు నిబంధనలోనే ఆ అంశం పొందుపరిచి ఉంటుంది. కొత్తగా అఫిడవిట్ తీసుకున్నామంటూ తప్పును కప్పిపుచ్చుకొనే ప్రయత్నం చేశారు. పైగా స్థలం ఖాళీగా ఉన్నందున వేలం వేసినట్టు పేర్కొన్నారు. స్వామివారి కళ్యాణం అనంతరం అమ్మవారితో కలిసి పారువేట మండపం వద్ద పూజలందుకుంటారు. ఆ సమయంలో భజంత్రీలు, పల్లకీమోసే వారు, భక్తులు నిలబడేందుకు వినియోగించే సదరు స్థలం ఖాళీగా ఉందన్న అధికారి ప్రకటనపై భక్తులు మండిపడుతున్నారు.


సర్వేలతో ఆర్అండ్‌బీ, రోడ్డుపై మార్కింగ్ వేసిన అధికారులు (ఫైల్‌ఫొటో)

ఆక్రమణలపై అస్పష్ట వివరణ..

సర్వేనెంబర్ 821లో గల 5.38 ఎకరాలలో రోడ్ల నిర్మాణం, ఆక్రమణలపై అధికారుల వివరణలో సదరు భూమిలో ఏర్పాటు చేసిన మూడు రోడ్లు అక్రమమని స్పష్టం చేశారు. నోటీసులు ఇచ్చి ఆక్రమణలు తొలగిస్తామని చెప్పారు. ఆ రోడ్లకు దిగువన చాలా మంది నివాసం ఉంటున్నారు. వారిలో ఎవరిని బాధ్యుల్ని చేస్తారో అధికారులు స్పష్టం చేయాల్సి ఉంది.

కొలతల కిరికిరి..

వైసీపీ ఐదేళ్ల పాలన చివరలో రోడ్ల విస్తరణలో భాగంగా చందర్లపాడు రోడ్డు విస్తరణకు సిద్ధమైంది. విస్తరణలో స్వామివారి ఆలయ భూమి తీసుకోవడానికి వీలులేదని భక్తులు పట్టుబట్టడంతో మునిసిపల్, దేవదాయశాఖ అధికారుల సమక్షంలో భూమికి కొలతలు వేశారు. ఆ కొలతల ప్రకారం రోడ్డు నిర్మించారు. ఆలయానికి చెందిన 5.38 ఎకరాలు పూర్తి విస్తీర్ణం ఉన్నట్టుగా ధ్రువీకరించారు. కానీ ఇటీవల కొందరు భక్తులు సదరు భూమి ఆక్రమణలకు గురైనట్టు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ, దేవదాయశాఖ జాయింట్ సర్వే నిర్వహించాయి. ఈ సర్వే ప్రకారం చందర్లపాడు రోడ్డు సగానికి పైగా ఆలయ భూమిలో ఉన్నట్టు అధికారులు తేల్చారు. దీనిని బట్టి స్వామివారి ఆలయ భూమి ఆర్అండ్‌బీ రోడ్డులో గానీ, ఎవరైతే ఆక్రమించారని అనుమానితులుగా ఉన్న సరిహద్దు వారి చేతుల్లోనో ఉండి ఉండాలి. ఈ రెండు సర్వేలలో ఏ సర్వే నిజమైనదో తేల్చి బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సి ఉంది. దీంతో పాటు బైపాస్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆలయానికి చెందిన 55 ఎకరాల భూముల చుట్టూ రియల్ ఎస్టేట్ వ్యాపారులు భారీగా ఆక్రమణలకు దిగినట్టు ఆరోపణలు వస్తున్నాయి. వారిని కాపాడేందుకే దీర్ఘకాలిక లీజులకు భూములు ఇచ్చి చేతులు దులుపుకోవాలని అధికారులు భావిస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.

కదలని యంత్రాంగం..

స్వామివారి ఆలయభూములపై సమగ్ర సర్వే నిర్వహించి పటిష్టమైన హద్దురాళ్లు ఏర్పాటు చేయించాలని ఇటీవల ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అధికారులను ఆదేశించారు. దేవదాయ శాఖ అధికారులతో కలిసి సర్వే చేపట్టాలని ఆర్డీవోను ఆమె కోరారు. దీనిపై ఇంత వరకూ ఆయా శాఖలు ముందుకు రాకపోవడం.

జాతీయ క్రీడలకు వేదికగా ఏపీ

» ఎంపీ కేశినేని శివనాథ్

నందిగామ, ఆగస్టు 22 : జాతీయ, అంతర్జాతీయ క్రీడలకు ఆంధ్రప్రదేశ్ వేదిక కాబోతుందని విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ తెలిపారు. సోమవారం జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్, జిల్లా టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురామ్‌లతో కలిసి నందిగామ వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం క్రీడా రంగానికి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఏపీ క్రికెట్ అసోసియేషన్ ఏకగ్రీవంపై ఆయన మాట్లాడుతూ, మొత్తం 34 సంఘాలు ఏకగ్రీవం కానున్నాయని, పోటీ లేనందున త్వరలో ఎన్నిక ఫలితాలు వెలువడుతాయన్నారు. విజయవాడ,


తనను కలిసిన రైతులతో మాట్లాడుతున్న ఎంపీ కేశినేని శివనాథ్

మంగళగిరి, కడప స్టేడియాలలో అంతర్జాతీయ క్రికెట్ పోటీలు జరిగేలా చర్యలు చేపడతామన్నారు. 2027-28లలో జాతీయ క్రీడలను రాష్ట్రంలో నిర్వహించేలా సీఎం చంద్రబాబు సహకారంతో ప్రయత్నాలు చేస్తానన్నారు. రానున్న రోజుల్లో క్రీడలు అంటే ఆంధ్రప్రదేశ్ అనేలా చేస్తామని చెప్పారు.

నందిగామ, కొండపల్లి మునిసిపాలిటీలు టీడీపీ వశం ఖాయం

త్వరలో ఎన్నికల కమిషన్‌ను కలిసి చైర్మన్ ఎన్నికపై నోటిఫికేషన్ కోరనున్నట్టు ఎంపీ తెలిపారు. నందిగామ, కొండపల్లిలో టీడీపీకి బలం ఉన్నందున చైర్మన్ పీఠం దక్కించుకుంటామన్నారు. వైసీపీ పాలనా విధానాలు నచ్చక పెద్దఎత్తున కౌన్సిలర్లు కూటమిలోకి వచ్చారని చెప్పారు. అనంతరం ఆయన ప్రజలు ఇచ్చిన వినతి పత్రాలను స్వీకరించారు.

వేదాద్రి ఎత్తిపోతల నిర్వహణలో రైతుల భాగస్వామ్యం అవసరం

వైసీపీ పాలనలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైన వేదాద్రి ఎత్తిపోతల పథకం మరమ్మతులకు రైతుల సహకారం అవసరమని ఎంపీ అన్నారు. రైతులతో మాట్లాడిన ఆయన త్వరలో ఒక మోటార్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. ప్రాధాన్యతా క్రమంలో అన్ని ఎత్తిపోతల పథకాలకూ మరమ్మతులు చేయించి పూర్తిస్థాయి ఆయకట్టుకు నీరందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో దేశం నాయకులు కోగంటి బాబు, ఏచూరి రామకృష్ణ, కామసాని సత్యవతి, మన్నె కళావతి, కత్తురోజు శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

కీచక టీచర్‌పై వేటు

కంకిపాడు, ఆగస్టు 26 : విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి ఉత్తర్వులు జారీ చేసినట్టు మండల విద్యాశాఖ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఈడుపుగల్లు ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయుడు మండవ శ్రీనివాసు అదే పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారంటూ వచ్చిన ఫిర్యాదు మేరకు విచారించిన విద్యాశాఖ ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రసాద్ తెలియజేశారు.

పుల్లేరులో మునిగి విద్యార్థి మృతి



గుడ్లవల్లేరు, ఆగస్టు 26 : స్నేహితులతో కలిసి సరదాగా కాలవకు వెళ్లి ప్రమాద వశాత్తు పుల్లేరులో మునిగి శవమై తేలిన యువకుడి ఉదంతమిది. గుడ్లవల్లేరు ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రన్న కాలనీకి చెందిన కోలా జోషి(16) మరో ముగ్గురు స్నేహితులతో కలిసి నీలకంఠేశ్వరపురంలో పుల్లేరులో ఆదివారం ఉదయం 9.30 గంటల సమయంలో స్నానానికి వెళ్లాడు. ఈత రాకపోవడంతో జోషి కాలుజారి కాల్వలోకి జారిపోయాడు. కళ్లముందే జోషి నీటిలో కొట్టుకుపోవడంతో స్నేహితులు గుడ్లవల్లేరు పోలీసులకు సమాచారమిచ్చారు. ఎన్డీఆర్ఎఫ్ బృందం, రెవెన్యూశాఖలు సంయుక్తంగా గాలింపు చేపట్టారు. సోమవారం ఉదయం రైల్వే బ్రిడ్జ్ సమీపంలో మృతదేహాన్ని గుర్తించారు. కొడుకు మృతితో తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు తల్లడిల్లిపోయారు. జోషి మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం చేసి కుటుంబసభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

సుబాబుల్‌కు రికార్డు ధర

» రైతుల్లో హర్షాతిరేకం

కంచికచర్ల : జిల్లాలో సుబాబుల్‌కు రికార్డు స్థాయిలో ధర లభిస్తున్నది. పేపరు కంపెనీల డిమాండ్‌కు తగినంతగా ముడిపదార్థమైన సుబాబుల్ కర్ర సరఫరా లేనందున ధర బాగా పెరిగింది. డంపింగ్ యార్డు వద్ద టన్నుకు రూ. 7,050ల ధర లభిస్తున్నది. గత ఏడాది ప్రారంభంలో టన్నుకు రూ.15 వందలు లభించటం గగనం కాగా, ప్రస్తుతం ఖర్చులు పోను చేతికి నికరంగా టన్నుకు రూ. ఆరు వేలకు పైగా అందుతుండటంతో రైతుల ఆనందానికి అవధుల్లేవు.

ఎన్టీఆర్ జిల్లాలో ముఖ్యంగా నందిగామ, జగ్గయ్యపేట, మైలవరం, తిరువూరు నియోజకవర్గాల్లో ఇంతకు ముందు సుమారుగా లక్ష ఎకరాల్లో సుబాబుల్ తోటలుండేవి. గత ఏడాది సుబాబుల్ రైతులు నిలువు దోపిడీకి గురయ్యారు. మద్దతు ధరలో సగానికి సగం కాదు కదా, నామమాత్రపు ధర కూడా రైతులకు రాలేదు. గత జనవరిలో టన్నుకు రూ. 15 వందలు రావటం చాలా కష్టమైంది. వైసీపీ పాలనలో ఐదేళ్లు గిట్టుబాటు ధర



ఇవ్వకుండ పేపరు కంపెనీలు, రైతులను జలగల్లా పీల్చి పిప్పి చేశాయి. గిట్టుబాటు ధర కోసం రైతుల ఆందోళన అరణ్యరోదనగా మారింది తప్పితే పాలకులు పట్టించుకోలేదు. తీవ్రంగా నష్టపోయిన పలువురు రైతులు సుబాబుల్ తోటలు తొలగించి, ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయటం ప్రారంభించారు. దీంతో జిల్లాలో తోటల సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. ప్రస్తుతం సుబాబుల్ తోటలు 50 వేల ఎకరాల లోపు ఉంటాయని అంటున్నారు.

ఒకవైపు తోటల విస్తీర్ణం తగ్గటం, మరోవైపు వర్షాకాలం కావటంతో సుబాబుల్ తోటలు నరకటానికి వీలుపడకపోవటం వల్ల ప్రస్తుతం కర్ర తగ్గిపోయింది. నిన్నటి దాకా గుత్తాధిపత్యంతో ధర విషయంలో పెత్తనం చెలాయించిన కంపెనీలు కర్ర కోసం పోటీపడుతూ ధర పెంచుతున్నాయి. కొత్త ప్రభుత్వాలు ఏర్పడిన తర్వాత మరల ధరలో కదలిక వచ్చింది. ప్రస్తుతం డంపింగ్ యార్డుల వద్దకు తీసుకువెళితే టన్నుకు రూ. 7,050ల వంతున ధర లభిస్తున్నది. రైతుల చేతికి నికరంగా రూ. 6,100లు అందుతున్నాయి. సుబాబుల్ చరిత్రలో ఈ ధర ఒక రికార్డు. కూటమి ప్రభుత్వంలో అత్యధిక ధర లభిస్తుండటంతో రైతులు ఎంతో సంతోషంతో ఉన్నారు. కంపెనీల అవసరాల మేరకు కర్ర సరఫరా లేనందున ఈ ధర ఇంకా పెరగవచ్చునని రైతులు అంటున్నారు. ధర పెరగటం వల్ల ఎక్కువ మంది రైతులు సుబాబుల్ తోటల సాగు వైపు మొగ్గు చూపుతున్నారు.

సాగుకు పోవాలంటే.. వాగు దాటాల్సిందే!

» పంటల సాగుకు ఆటంకంగా గుర్రపు వాగు
» వంతెన నిర్మాణానికి రైతుల ఎదురుచూపు

తిరువూరు : ఎరుకోపాడు వద్ద గుర్రపువాగుపై వంతెన నిర్మాణం పూర్తిచేయాలని స్థానిక రైతులు కోరుతున్నారు. 2012లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సుమారు రూ.56 లక్షల వ్యయంతో చెపట్టిన వంతెన నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. అప్పటి నుంచి ప్రభుత్వాలు మారినా ఈ నిర్మాణం ఎవ్వరూ పట్టించుకోక పోవడంతో రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

వాగువస్తే రాకపోకలకు ప్రమాదమే..

కొద్దిపాటి వరద వచ్చినా వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రైతులు సాగుభూములకు వెళ్లలేని పరిస్థితి. ఎరుకోపాడుతో పాటుగా, కొమ్మిరెడ్డిపల్లి, చింతలపాడు, గొల్లగూడెం తదితర గ్రామాలకు చెందిన రైతుల సాగుభూములు గుర్రపువాగు అవతల వైపు ఉండటంతో నిత్యం రైతులు, వ్యవసాయ కూలీలు గుర్రపువాగు దాటాల్సిందే. సాధారణ రోజుల్లో నీరు ఉన్నా వాగుదాటి వెళుతున్న రైతులకు వరద వస్తే మాత్రం వాగుదాటడం కష్టాసాధ్యం అవుతోంది. వరద తగ్గేవరకు ఈ ప్రాంతంలో రాకపోకలు నిలిచిపోవల్సిందే.

పంట దిగుబడి తోలకాలకు ఇబ్బంది పడాల్సిందే..

వాగు అవతలవైపు ఉన్న భూముల్లో దిగుబడి అయిన పంటను


వాగు నీటిలో నుంచి సాగుభూములకు వెళుతున్న రైతులు, వ్యవసాయ కూలీలు


అసంపూర్తిగా వంతెన నిర్మాణ పనులు

రైతులు ఇంటికి తెచ్చుకునేందుకు నానాఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంట లోతుడుతో వాహనాలు వాగులో దిగబడుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొమ్మిరెడ్డిపల్లి, ముష్టికుంట్ల, వామకుంట్ల, గొల్లగూడెం తదితర గ్రామాల్లో మిర్చి, వరి పంటలను గంపలగూడెం మార్కెట్ యార్డుకు తరలించేందుకు రైతులు గుర్రపువాగు మీదుగా వెళుతుంటారు. ప్రస్తుతం వాగుపై బ్రిడ్జి నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోవడంతో రైతులు చింతలపాడు మీదుగా మార్కెడ్‌యార్డుకు వెళ్లాల్సి వస్తుండంతో రైతులపై రవాణభారం పడుతుంది, పాలకులు, అధికారులు స్పందించి ఎరుకోపాడు వద్ద గుర్రపువాగుపై నిలిచిపోయిన బ్రిడ్జి నిర్మాణం పనుల్ని చేపట్టి పూర్తిచేయాలని రైతులు కోరుతున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	114, 123, 134
చికెన్ విత్ స్కిన్	220
చికెన్ స్కిన్‌లెస్	230

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.75

ఉమామహేశ్వరపురంలో పట్టపగలు చోరీ

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 26 : పట్టపగలు ఇంటి తలుపులు పగలకొట్టి గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి ఐదున్నర కాసుల బంగారం, రూ. లక్ష విలువ చేసే వెండి వస్తువులు చోరీ చేసిన ఘటన వీరవల్లి పీఎస్ పరిధిలోని ఉమామహేశ్వరపురంలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కరణం వెంకటరమణ ఇంటికి తాళం వేసి పొలం పనులకు వెళ్లింది. మధ్యాహ్నం ఇంటికి వచ్చే సరికి తలుపులు తెరిచి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో దాచి ఉంచిన సుమారు రూ. 4 లక్షలు విలువ చేసే ఐదున్నర కాసుల బంగారు ఆభరణాలు, రూ. లక్ష విలువ చేసే వెండి వస్తువులను అపహరించుకుపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వీరవల్లి ఎస్సై శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. క్లూస్ టీం ఘటనా స్థలానికి వెళ్లి వేలి ముద్రలు సేకరించారు.



ఈడుపుగల్లు ఆంజనేయ టౌన్‌షిప్‌లో కృష్ణాష్టమి వేడుకల్లో చిన్నారులు



గన్నవరంలో ఉట్టి కొట్టడంలో పాల్గొన్న సంఘ నేతలు, యువకులు



వీరవల్లి గీతా మందిరంలో ..

వైభవంగా కృష్ణాష్టమి

గుణదల, ఆగస్టు 26 : కృష్ణాష్టమి వేడుకలు సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే ప్రత్యేక పూజలతో పాటు మధ్యాహ్నం అన్నసంతర్పణ, సాయంత్రం ఉట్టికొట్టే కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.

రామవరప్పాడులో రెండు వర్గాల వారు టీడీపీ నాయకులు, మంత్రుల ఫ్లెక్సీలతో వేర్వేరుగా కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. రామవరప్పాడు సర్పంచ్ వరి శ్రీదేవి జాతీయ రహదారి పక్కన కృష్ణుడి ఆలయ నిర్మాణ చేపట్టిన ప్రదేశంలో నిర్వహిం చిన పూజలో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు. ఉదయం పూజ, మధ్యాహ్నం అన్న సంతర్పణ, సాయంత్రం ఉట్టికొట్టుడు కార్యక్రమంలో యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

● రామవరప్పాడు వంతెన సెంటర్ వద్ద గ్రామ వార్డు సభ్యుడు కొంగన రవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కృష్ణాష్టమి వేడుకల్లో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, టీడీపీ నాయకులు కొల్లా ఆనంద్, నబిగాని కొండ, గూడవల్లి నరసయ్య, బొప్పన హరికృష్ణ, రామకృష్ణరాజు, అద్దేపల్లి సాంబశివ నాగరాజు(సాంబు) తదితరులు పాల్గొన్నారు.



రామవరప్పాడు వంతెన సెంటర్ వద్ద టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



సర్పంచ్ వరి శ్రీదేవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కృష్ణాష్టమి వేడుకలకు హాజరైన జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ

సీతారామచంద్రస్వామి ఆలయంలో..

గన్నవరం : మండలంలోని పలు గ్రామాల్లో శ్రీకృష్ణా జన్మాష్టమి వేడుకలు సోమవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాల్లో పూజలతో పాటు ఇళ్ల వద్ద చిన్నారులకు శ్రీకృష్ణుడి వేషధారణలు ధరించి సందడి చేశారు. దావాజీగూడెం సీతారామ చంద్రస్వామి ఆలయంలో కృష్ణాష్టమి సందర్భంగా పదివేల తులసి దళాలతో సహస్రనామార్చన జరిపారు. సాయంత్రం భక్తులచే విష్ణు సహస్రనామ పారాయణం, శ్రీకృష్ణాష్టక పారాయణం, భగవన్నామ సంకీర్తనలు జరిగాయి. చిన్నారుల చేత ఉట్టి కొట్టుడు కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు రామాచార్యులు విశేష పూజలు జరిపి తీర్థప్రసాదాలు అందజేశారు.

● గన్నవరం యాదవులపేట రామాలయంలో సోమవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం పట్టణ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. యాదవ సంఘానికి చెందిన చిమట గంగాధర్, చిమట రవివర్మ, గోపి, చిన్నా, బోయిన శ్రీనివాసరావు, సర్నాల రమేష్, మహి, నాని, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వీరవల్లి శ్రీకృష్ణ గీతామందిరంలో

హనుమాన్‌జంక్షన్ : వీరవల్లి శ్రీకృష్ణ గీతామంది రంలో సోమవారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణ భగవానుడికి ప్రత్యేక పూజ లు, అభిషేకాలు జరిపారు. పంచాయతీ వాటర్‌మెన్ వాసుబోయిన వాసుకుమార్ ఆధ్వర్యంలో అష్టోత్తర పూజలు వేడుకగా నిర్వహించారు. అనంతరం భక్తు లకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మంది రం నిర్వాహకులు నందమూరి నాగశిరోమణి, నాగ భూషణబాబూరావు, సాయిమందిరం నిర్వాహకు లు కోడెబోయిన బాబీ, సచివాలయం కార్యదర్శి చిలకంటి ప్రసాద్, నందమూరి సంధ్య, వడ్లమూడి రమేష్, సుంకర సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మంతెన, కోలవెన్నులో..

కంకిపాడు : మండలంలోని వివిధ గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పలు గ్రామాల్లోని పాఠశాలల్లో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో చిన్నారుల నృత్య ప్రదర్శన అలరించింది. మంతెనలో నిర్వహిం చిన ఉట్టికొట్టుడు కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పాల్గొన్నారు. చిన్నా రులతో ఉట్టి కొట్టించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవినేని రాజా తదితరులు పా ల్గొన్నారు. కోలవెన్నులో టీడీపీ నాయకులు రామ్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో టీడీపీ నాయకులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన అన్నసంతర్పణ కార్యక్రమంలో సుమారు 300 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చిన్ని, టీడీపీ నాయకులు తుమ్మల జగదీష్, కంచర్ల శేషగిరి తదితరులు పాల్గొన్నారు. ఈడుపుగల్లులోని ఆంజనేయ టౌన్ షిప్‌లో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో..

ఉయ్యూరు : ఉయ్యూరు పట్టణ, మండల పరిధి గ్రామాల్లో సోమవారం శ్రీకృష్ణాష్టమి వేడుక భక్తిశ్రద్ధలతో నిర్వ హించారు. వేణుగోపా లస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అలంకారం చేశారు. స్వామివారిని దర్శించు కుని పూజలు చేసేందుకు భక్తులు తరలివచ్చారు. వీరమ్మతల్లి ఆలయం వద్ద, శివాలయం రోడ్డులో కృష్ణాష్టమి వేడుకగా జరిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఉట్టికొట్టే కార్యక్రమంలో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో వేణుగోపాలస్వామి

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు



ఆటో డ్రైవర్లకు సూచనలు చేస్తున్న ఉయ్యూరు పట్టణ, రూరల్ ఎస్సైలు

ఉయ్యూరు, ఆగస్టు 26 : రోడ్లపై ఎక్కడపడితే అక్కడ అడ్డదిడ్డంగా ఆటోలు నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని ఉయ్యూరు పట్టణ, రూరల్ ఎస్సైలు విశ్వనాథ్, సురేశ్‌బాబు ఆటో డ్రైవర్లను హెచ్చరించారు. కాటూరు రోడ్డు, పామర్రు రోడ్డు, కంకిపాడు రోడ్లలో తిరిగే ఆటోల డ్రైవర్లతో స్థానిక ప్రధాన సెంటర్‌లో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి ప్రవర్తిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుం టామని, మద్యం సేవించి ఆటోలు నడిపే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు.

తాడిగడపలో కొవ్వొత్తుల ర్యాలీ

పెనమలూరు, ఆగస్టు 26 : కోల్‌కతాలో మహిళా డాక్టర్‌పై జరిగిన హత్యాచారానికి నిరసనగా తాడిగడప సీఐటీయూ, ఐద్వా ఆధ్వర్యంలో తాడిగడప మునిసిపాలిటీలో కొవ్వొత్తు ల ర్యాలీ నిర్వహించారు. కార్మికనగర్ కట్టపై సోమవారం జరిగిన ఈ ర్యాలీలో సంఘ కార్యదర్శి పుసులూరి పాతాళలక్ష్మి మాట్లాడుతూ, ఆడపిల్లల్ని వేధింపులకు గురిచేసే కామాంధులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ కార్యదర్శి త్రిమూర్తులు మాట్లాడుతూ, ఆడపిల్లలు అర్ధరాత్రి నడిరోడ్డుపై తిరగగలిగినప్పుడే మనకు నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భవాని, ఈశ్వరి, రవణమ్మ, పార్వతి, కోటేశ్వరమ్మ, వెంకటేశ్వరమ్మ, ఆదిలక్ష్మి, కామేశ్వరి, లావణ్య, భవాని బి రాణి తదితరులు పాల్గొన్నారు.



కొవ్వొత్తుల ర్యాలీలో సీఐటీయూ నాయకులు

22 మద్యం సీసాలు పట్టివేత

పెనమలూరు, ఆగస్టు 26 : గోసాల ఎలిమెంటరీ పాఠశాల సమీపంలో ఆదివారం సాయంత్రం అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 22 సీసాల మద్యాన్ని స్వాధీనం చేసుకొన్నట్లు పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపారు.

● పోరంకి అంధ్రాబ్యాంకు పక్కనే ఉన్న ఒక ఇంటిలో పేకాడుతున్న ఎనిమిది మందిని ఆదివారం పెనమలూరు పోలీసులు అరెస్టు చేసి, రూ. 15వేలు స్వాధీనం చేసుకొన్నారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు సీఐ వెంకటరమణ తెలిపారు. అక్రమంగా మద్యం అమ్మేవారు, పేకాట రాయుళ్లు, గంజాయి విక్రేతలపై ఉక్కుపాదం మోపుతామని సీఐ హెచ్చరించారు.

ఆర్వోబీ రైలింగ్‌కు మరమ్మతులు



మరమ్మతు పనులు చేస్తున్న కూలీలు

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 26 : స్థానిక నూజివీడు రోడ్డులో ప్రమాదకరంగా మారిన ఆర్వోబీ రైలింగ్‌కు ఎట్టకేలకు అధికారులు మరమ్మతులు చేపట్టారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రమాదవశాత్తు లారీ దూసుకెళ్లిన ఘటనలో రైలింగ్ ధ్వంసమైంది. వంతెన రెండు వైపులా ప్రమాదకరంగామారాయి. ప్రమాదం జరిగి దాదాపు నాలు గేళ్లు అవుతున్నా అధికారులు పట్టించుకోలేదు. ప్రజలు నిత్యం తమ ప్రాణాలను గుప్పెట పెట్టుకొని వంతెనపై ప్రయాణిస్తున్నారు. ఎట్టకేలకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రోడ్డు మరమ్మతు పనులు చేపట్టింది. అందులో భాగంగా వంతెన రైలింగ్ మరమ్మతు పనులతో పాటు రోడ్డుపై ఏర్పడ్డ గోతులను కూడా పూడ్చారు.

రోడ్డు ప్రమాదంలో
గాయపడిన వ్యక్తి మృతి

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 26 : జంక్షన్ పీఎస్ పరిధిలోని బొమ్ములూరు వద్ద ప్రమాదవశాత్తు రోడ్డు మార్జిన్‌లో డివైడర్‌ను ఢీ కొని తీవ్రంగా గాయపడిన ఏలూరు గ్రామానికి చెందిన రాజులపాటి రామ్మోహన్‌రావు (56) సోమవారం మృతి చెందాడు. మృతుడు ఈ నెల 21న ద్విచక్రవాహనంపై హనుమాన్‌జంక్షన్ నుంచి ఏలూరు వైపు వెళుతుండగా ప్రమాదానికి గురయ్యాడు. మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బాధితుడు మృతి చెందినట్లు ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జనార్దన్ తెలిపారు.

వైసీపీ పాలనలో హాస్టళ్లు నిర్వీర్యం



ఈడుపుగల్లు హాస్టల్‌ను ఆకస్మిక తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

ఈడుపుగల్లు (కంకిపాడు), ఆగస్టు 26 : గత వైసీపీ ప్రభుత్వ పాలనలో ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహాలను నిర్వీర్యం చేశారని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మండిపడ్డారు. ఈడుపుగల్లులోని ప్రభుత్వ బాలురు వసతి గృహాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి వారు ఎదుర్కొం టున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, వాడుక నీరు సక్రమంగా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, భవనం కూడా శిథిలావస్థకు చేరిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బోడె ప్రసాద్ మాట్లాడుతూ, ఈడుపు గల్లులోని వసతిగృహంతో పాటు నియోజక వర్గంలోని అన్ని ప్రభుత్వ వసతి గృహాలను పరిశీలించి అభివృద్ధికి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవినేని రాజ, సర్పంచ్ ఇందిర, సుదిమళ్ల రవీంద్ర, కిలారు శ్రీను, సుధాకర్, అనుమోలు రామకృష్ణ, సుంకర శ్రీహరి, షేక్ షకార్, చెల్లి సంగీతరావు, దేవినేని రత్నభూషణ్, చిన్నబాబు, సుధాకర్, పర్వతనేని వెంకట శ్రీనివాసు, సురేంద్ర, మాధవ పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు ముమ్మరం

గన్నవరం, ఆగస్టు 26 : మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్య చర్యలు సోమవారం చేపట్టారు. గ్రామాల్లో విష జ్వరాలు ప్రబలుతున్నాయని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు దృష్టికి పలువురు తీసుకువెళ్లగా ఉన్నతాధికారులకు పారిశుధ్య చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అల్లాపురంలో బ్లీచింగ్ చల్లి ఫీవర్ సర్వే నిర్వహించారు. సర్పంచ్ డొక్కు సాంబశివ వెంకన్నబాబు, కార్యదర్శి సత్య బాబు, ఉప సర్పంచ్ ఆవుటపల్లి శివ ప్రసాద్, అచ్చియ్య, రాము, మరియదాసు, పూర్ణచంద్రరావు, ఏఎన్ఎం శ్రీదేవి, సుజాత పాల్గొన్నారు. పురుషోత్తపట్నం, కొండ పావులూరు, గోపవరపుగూడెం, సూరంపల్లిలో పారిశుధ్య చర్యలు చేపట్టారు.

● **హనుమాన్‌జంక్షన్ :** మండల కేంద్రమైన బాపులపాడులో పంచాయతీ కార్యదర్శి చోరగుడి ప్రసాద్ పర్యవేక్షణలో పారిశుధ్య పనులు సోమవారం ముమ్మరంగా నిర్వహించారు. డ్రైయిన్లలో పూడిక తీయడంతో పాటు మురుగు కాలువల వెంబడి బ్లీచింగ్, దోమల మందు చల్లారు. పీహెచ్‌సీ వైద్య సిబ్బందితో ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహించారు. వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు ముందు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శానిటరీ మేస్త్రీ నాంచారయ్య, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బాపులపాడులో బ్లీచింగ్ జల్లుతున్న పారిశుధ్య సిబ్బంది

ప్రేమకు ప్రతిరూపం మదర్‌థెరిసా : బోడె

పెనమలూరు, ఆగస్టు 26 : శాంతి, సహనం, ప్రేమకు ప్రతిరూపం మదర్‌థెరిసా అని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం మదర్ థెరిసా జయంతి సందర్భంగా తాడిగడప మునిసిపాలిటీ పోరంకి బీజేఆర్ నగర్‌లో మదర్‌థెరిసా విగ్రహానికి పూలమాలలు వేసి ఎమ్మెల్యే, అనుమోలు ప్రభాకరరావు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మంచినేని పరమేష్, యేను గు శ్రీనివాస్, వినుకొండ రాజా, బందెల రవి, బందెల చంటి, వేమూరి ప్రసాద్, బొక్కా ప్రభాకరరావు, పరిమి మోషే, రాజశేఖర్, బూక్య సౌజన్య, శిఖామణి, నందేటి సూర్య, శౌరి, బొంగరాల అబ్రహాం, ఆకునూరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. ● కానూరులోని అశోక్ జిమ్ ఆవరణలో మదర్ థెరిసా పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. మదర్ చిత్రపటానికి ఎస్సై వరలక్ష్మి పూలమాలవేసి నివాళులర్పించారు. అశోక్ జిమ్ ద్వారా అనేక సేవలు అందిస్తున్న మాతృహృదయ్ సేవా సంస్థ నిర్వాహకులు అశోక్, శారదలను అభినందించారు. కార్యక్రమంలో వైష్ణవి నరేంద్ర, ఈదా రాజేష్, కోటి, ఎన్ శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. **ఉయ్యూరు :** సేవాభావం, దయాగుణానికి ప్రతీక మదర్ థెరిసా అని లయన్స్ లయన్స్ క్లబ్ జిల్లా క్యాబినేట్ డిప్యూటీ సెక్రటరీ నూకల వెంకట సాంబశివరావు అన్నారు. లయన్స్‌క్లబ్ జోన్ చైర్‌పర్సన్ ఎండీ ఇస్మాయిల్ ఆధ్వర్యంలో సోమవారం మదర్ థెరిసా జయంతి ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ నగర్‌లో థెరిసా విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పారిశుధ్య మహిళా కార్మికులకు చీరలు పంపిణీ చేసారు. క్లబ్ ట్రెజరర్ దినవహి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పోరంకి బీజేఆర్ నగర్‌లో కేక్ కట్ చేస్తున్న బోడె ప్రసాద్



ఉయ్యూరులో చీరలు పంపిణీ

అంగన్వాడీలకు ప్లేట్లు, గ్లాసుల అందజేత

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 26: శాంతి దూత మదర్ థెరిసా జయంతిని పురస్కరించుకొని సోమవారం స్థానిక లయన్స్ క్లబ్ నిర్వాహకులు సేవా కార్యక్రమం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు కళ్లేపల్లి నారాయణరావు ఆధ్వర్యంలో గ్రామంలోని పలు అంగన్వాడీ స్కూల్స్ చిన్నారులకు స్టీల్ ప్లేట్లు, గ్లాసులు అందజేశారు. మదర్ థెరిసా చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ నాయకులు చలసాని వెంకటేశ్వరరావు, నండూరి సత్యవేంకటేశ్వర శర్మ, అక్కినేని ఫణి, మాకినేని శ్రీనివాసరావు, తాడి రంగారావు, పోట్రు శ్రీనివాసరావు, అంబల్ల రంగారావు, అంగన్వాడీ కార్యకర్త లక్ష్మీకుమారి తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులకు ప్లేట్లు, గ్లాసులు అందజేస్తున్న లయన్స్ క్లబ్ నాయకులు

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	114, 123, 134
చికెన్ విత్ స్కిన్	220
చికెన్ స్కిన్‌లెస్	230



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.4.75

చెన్నై స్మారక మందిరంలో అమరజీవికి బుద్ధప్రసాద్ నివాళి



అవనిగడ్డ, ఆగస్టు 26 : చెన్నై నగరంలో అమరజీవి పొట్టి శ్రీరాములు బలిదానం చెందిన స్మారక మందిరాన్ని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సోమవారం సందర్శించి ఆయనకు నివాళులర్పించారు. పొట్టి శ్రీరాములు స్మారక మందిర కార్య నిర్వాహకులు అనిల్ కుమార్ రెడ్డి, గుడిమెట్ల చెన్నయ్య, రచయిత భువనచంద్ర, జీఎం నాయుడు, నారాయణ గుప్తా ప్రభృతులు బుద్ధప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సేవలో ఎస్పీ దంపతులు



స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు ఎస్పీ దంపతులకు అందిస్తున్న సత్యనారాయణ

మోపిదేవి : సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాన్ని ఎస్పీ ఆర్.గంగాధర్‌రావు కుటుంబ సమేతంగా సోమవారం సందర్శించి స్వామి వారికి విశేష పూజలు జరిపారు. ఆలయ అధికారులు, అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. నాగపుట్టలో పాలుపోసి స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు జరిపారు. అర్చక బృందం వేదమంత్రాలతో ఆశీర్వచనం పలికి శేషవస్త్రాలతో సత్కరించారు. ఆలయ పర్యవేక్షకులు బొప్పన సత్య నారాయణ స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు ఎస్పీ దంపతులకు అందజేశారు. అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్ తదితరులు ఆయన వెంట ఉన్నారు.



క్రీడా వారోత్సవాల్లో ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ

చదువుతో పాటు క్రీడలను ప్రోత్సహించాలి

మచిలీపట్నం టౌన్ : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. జాతీయ క్రీడా వారోత్సవాల సందర్భంగా సోమవారం మంత్రి కొల్లు రవీంద్ర, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు హసీంబేగ్ తదితరులతో జిల్లా స్పోర్ట్స్ అధికారి ఝాన్సీ ప్రతిజ్ఞ చేశారు. అంధ్రప్రదేశ్ యోగసభ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ డీకే బాలాజీ, యోగా గురువులు ఘంటసాల గురునాథబాబు, మద్దాల చింతయ్య ప్రతిజ్ఞ చేశారు.



అలీనఖీపాలెంలో పీర్ల ఊరేగింపు, చెస్ట్ బీటింగ్

అలీనఖీపాలెం(పమిడిముక్కల) : అలీనఖీపాలెంలో సోమవారం షియా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. మహ్మద్ ప్రవక్త మనుమడు హజ్రత్ ఇమామ్ హుస్సేన్ ఆయన అనుచరులు కర్బలా మైదానంలో వీరమరణం పొందిన నేపథ్యంలో నలభై రోజులు సంతాపం దినాలు పాటించడం పరిపాటి. ఈ సందర్భంగా పాత పీర్లను ఊరేగించారు. యువకులు చెస్ట్‌బీటింగ్ చేసారు. ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా హాజరై ప్రార్థనలో పాల్గొని పీర్లు గుమ్మటాన్ని మోసి ఊరేగింపులో పాల్గొన్నారు. అంజుమన్ హుస్సేనీ అధ్యక్షుడు మీర్జా ఆబెద్ హుస్సేన్ ఈ కార్యక్రమ విశిష్టతను వివరించారు.

రోగులకు మెరుగైన వైద్యం అందిస్తాం



ఆసుపత్రిలో రోగులకు పెడుతున్న భోజనాన్ని పరిశీలిస్తున్న గోపీచంద్

మచిలీపట్నం టౌన్ : జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని టీడీపీ సీనియర్ నాయకులు గొర్రెపాటి గోపీచంద్ అన్నారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని గోపీచంద్, జిల్లా టీడీపీ ప్రచార కార్యదర్శి పీవీఫణికుమార్ సోమవారం సందర్శించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై గోపీచంద్ ఆరా తీశారు. ఆసుపత్రిలో రోగులకు పెడుతున్న భోజనాన్ని పరిశీలించారు. వైద్య సేవలపై వైద్యులతో మాట్లాడారు. మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరి సహకారంతో ఆసుపత్రిలో మెరుగైన వైద్యసేవలు అందిస్తామన్నారు. బోయినరాజు తదితరులు పాల్గొన్నారు.



అవనిగడ్డలో ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ యువకుమార్

నిబంధనలు పాటించని ఆటో డ్రైవర్లపై చర్యలు

అవనిగడ్డ : ఆటో డ్రైవర్లు అతివేగంతో వెళ్లినా, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకున్నా చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని అవనిగడ్డ సీఐ యువకుమార్ హెచ్చరించారు. అవనిగడ్డలోని అన్ని ఆటో స్టాండ్ల ఆటో డ్రైవర్లకు సోమవారం అవనిగడ్డ సీఐ యువకుమార్, ఎస్సై కె.శ్రీనివాస్ కౌన్సెలింగ్ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ డ్రైవర్లు డ్రైవింగ్ లైసెన్స్, వెహికల్ రికార్డులు తప్పనిసరిగా దగ్గర ఉంచుకోవాలని, కూలీలను పొలాల వద్దకు తీసుకెళ్లే సమయంలో పరిమితి మేరకే ఎక్కించుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



టీడీపీ నాయకుడు బాబూరావు జన్మదిన వేడుక

హనుమంతపురం (పమిడిముక్కల) : టీడీపీ సీనియర్ నాయకుడు లింగమనేని బాబూరావు పుట్టిన రోజు వేడుక వీరంకిలాకు వద్ద లింగమనేని యూత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, పార్టీ నాయకులు నన్నపనేని వీరేంద్ర, లింగమనేని వెంకట్రామయ్య, బుల్లెట్ బాబీ, శ్రీధర్, ఎస్. ప్రవీణ్, తెలుగుయువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి హాజరై బాబూరావుకు శుభాకాంక్షలు తెలియజేశారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. బాబూరావు పార్టీకి, ప్రజలకు చేస్తున్న సేవలను కొనియాడారు. యువ నాయకుడు వడ్డే సాయిశోభన్, సీనియర్ నాయకుడు మోటూరు వెంకట సుబ్బయ్య, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని బాబూరావుకు శుభాకాంక్షలు తెలిపారు.

ఫేక్ ఫోన్ పేతో మోసం చేస్తున్నారు జాగ్రత్త : సీఐ

అవనిగడ్డ : ఫేక్ ఫోన్ పే స్కానర్లతో మోసగించే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సీఐ యువకుమార్ సూచించారు. కృష్ణాపురంలోని పెట్రోల్ బంకులో ఇటీవల గుంటూరు జిల్లాకు చెందిన మేకల మోషే, జయపురం గ్రామానికి చెందిన నలుగురు మైనర్లతో కలిసి వచ్చి ఫోన్ పే ద్వారా నగదు పంపినట్లుగా మోసం చేసి రూ.4800 కాజేసినట్లు తెలిపారు. డీఎస్పీ మురళీధర్ పర్యవేక్షణలో తాను, కోడూరు ఎస్సై శిరీష దర్యాప్తు చేసి నిందితులను ఉల్లిపాలెం వద్ద అరెస్టు చేసినట్లు తెలిపారు.



బందరులో శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకల్లో మాట్లాడుతున్న మంత్రి రవీంద్ర



నాగాయలంకలో సందడి చేస్తున్న బాలబాలికలు



పెడనలో చిన్నారుల వేషధారణ, బాలికల కోలాటం

భగవద్గీత పఠనంతో సర్వశుభాలు

• కృష్ణజన్మాష్టమి వేడుకల్లో మంత్రి రవీంద్ర, ఎంపీ బాలశౌరి

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 26 : శ్రీకృష్ణుడు అర్జునుడికి బోధించిన భగవద్గీతను పఠించడం వల్ల సర్వశుభాలు కలుగుతాయని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఇస్కాన్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి బలరాముని పేటలో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొని ప్రసంగించారు. వచ్చే కృష్ణాష్టమికి యాదవ సంఘం మందిరాన్ని పూర్తి చేస్తామన్నారు. కొల్లు రవీంద్రతో పాటు టీడీపీ నాయకులు బచ్చుల బోసుబాబు, పల్లపాటి అభినవ్ తదితరులు పాల్గొన్నారు. బందరుకోట, చల్లరాస్తా, యాదవుల వీధి, యాదవ సంఘం ఆధ్వర్యంలో జరిగిన శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకల్లో మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు రొండి కృష్ణయాదవ్ పాల్గొన్నారు. గోపూజ నిర్వహించారు. ఉట్టి కొట్టే ఉత్సవం సందడిగా జరిగింది. వేడుక ఫంక్షన్ హాలు లో జరిగిన గోపూజలో మంత్రి కొల్లు రవీంద్ర, తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్, టీడీపీ నగర అధ్యక్షుడు ఎండి ఇలియాస్ పాషా, కార్యదర్శి పిప్పళ్ళ కాంతారావు, పల్లపాటి అభినవ్, పి.వి.ఫణికుమార్, కరెడ్ల సుశీల, పాలపర్తి పద్మజ, లంకే హరికృష్ణ పాల్గొన్నారు. ఎన్.గొల్లపాలెంలో జరిగిన కృష్ణాష్టమి వేడుకల్లో మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరి, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు పిప్పళ్ళ కాంతారావు, గోకుల శివ, తలారి సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు. కన్యకా పరమేశ్వరీ దేవాలయంలో జరిగిన శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్ తదితరులు పూజలు



ఎస్.గొల్లపాలెంలో చిన్నారులలో బాలశౌరి, రవీంద్ర



సిద్ధేంద్ర కళాపీఠంలో జరిగిన వేడుకల్లో చింతా రవిబాలకృష్ణ, నాట్య విద్యార్థులు

పెడన : కళాంజలి హైస్కూల్‌లో చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణతో అలరించారు. కోలాట నృత్యం ఆకట్టుకుంది. హైస్కూల్ ప్రిన్సిపాల్ కె. దిలీప్‌కుమార్ పర్యవేక్షించారు. **చల్లపల్లి :** శ్రీకృష్ణ జన్మాష్టమి చల్లపల్లిలో భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గీతామందిరాలు, దేవాలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. ఉట్టి కొట్టే కార్యక్రమం అత్యంత ఉత్సాహభరితంగా జరిగింది. ప్రతి ఇంటా తమ చిన్నారులకు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలు వేసి వారితో నృత్యాలు చేయించి సందడి చేశారు. **మోపిదేవి :** మోపిదేవి గొల్లపాలెంలో యాదవులు ప్రధాన కూడలిలో శ్రీ కృష్ణుడికి విశేష పూజలు చేసి మురళీ కోలాట ప్రదర్శన నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. **ఘంటసాల :** పాపవినాశనం గొల్లపాలెం వేణుగోపాలస్వామి దేవాలయంలో శ్రీ కృష్ణుడికి గొరిపర్తి శివరామకృష్ణ - సునీత దంపతులు 101 బిందెలతో జలాభిషేకం చేసి 101 కొబ్బరికాయలు కొట్టి మొ క్కు చెల్లించుకున్నారు. అర్చకులు శ్రీరామ్ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఉట్టి కొట్టే కార్యక్రమంలో చిన్నారులు పాల్గొన్నారు. **అవనిగడ్డ రూరల్ :** శ్రీకృష్ణాష్టమి సందర్భంగా చిన్నారుల వేషధారణ విశేషంగా ఆకట్టుకుంది. మోదుమూడిలో బచ్చు గంగాధర్ - తేజస్విని కుమార్తె గీతాశ్రీ, బచ్చు జగదీష్ - పృథ్వీ కుమారుడు, కుమార్తె హనుమ తేజ్, శ్రీఆద్య శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణ తో ఆకట్టుకున్నాయి. **అవనిగడ్డ :** గీతామందిరం, లక్ష్మీనారాయణ స్వామి ఆలయాలలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. గీతా మందిరంలో వేణుగోపాలస్వామికి పంచామృత అభిషేకాలు చేసి నవనీతం సమర్పించారు. విష్ణుసహస్రనామ పారాయణ, లక్ష్మి సహస్ర నామ స్తోత్ర పారాయణం చేశారు. అర్చక స్వాములు నరసింహమూర్తి, దీవి రఘు, బాలకృష్ణమాచార్యులు ప్రత్యేక పూజలు జరిపారు. ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు, ధర్మకర్త శ్రీహరిబాబు ఏర్పాట్లు పర్యవేక్షించారు. **నాగాయలంక :** శ్రీరామపాదక్షేత్రంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్నారులు రాధాకృష్ణుల వేషధారణతో అలరించారు. ఉట్టి కొట్టే వేడుక సందడిగా జరిగింది. మండవ బాలవర్థిరావు, అంబటి శ్యామ్ ప్రసాద్, చన్నగిరి లతామోహన్, నాగిడి తాతారావు తదితరులు రాగా, ఆలయ చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, ఉప్పల బుజ్జి తదితరులు పర్యవేక్షించారు. **కూచిపూడి :** శ్రీ కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కూచిపూడి శ్రీ రుక్మిణి, సత్యభామ సమేత రాజగోపాలస్వామి మందిరం, చినముత్తేవి, నిడుమోలు, కోసూరు, మొవ్వ తదితర గ్రామాల్లో శ్రీకృష్ణుడికి విశేష పూజలు, గోపూజ, ఉట్టి కొట్టే కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామోత్సవం జరిగింది. కూచిపూడి సిద్ధేంద్ర కళాపీఠంలో నిర్వహించిన వేడుకల్లో వైస్ ప్రిన్సిపాల్ చింతా రవిబాలకృష్ణ, నాట్య విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. భట్లపెనుమర్రు, కారకంపాడు గ్రామాల్లో నిర్వహించిన శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. ప్రజలు, ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. **పామర్రు :** రాధాకృష్ణుల వేషధారణతో చిన్నారులు అలరించారు. శ్రీకృష్ణుడి కరుణ ప్రజలందరిపై ఉండాలని విష్ణాలయం ప్రధాన అర్చకుడు ఆర్ ప్రసాద్ ఆకాంక్షించారు. **నందివాడ :** నందివాడ, కుదరవల్లి, తమిరిశ, పోలుకొండ, తుమ్మలపల్లి గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలు యాదవ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఉట్టికొట్టి సందడి చేశారు. **గుడివాడ రూరల్ :** రామన్నపూడి, సీపూడి, గుంటా కోడూరు, సెరిగొల్లేపల్లి తదితర గ్రామాల్లో శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు జరిగాయి. ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని యువత ఆనందోత్సాహాల నడుమ జరిపారు. **బంటుమిల్లి :** బంటుమిల్లి, ముల్లపర్రు, అర్తమూరు, కొర్లపాడు, తుమ్మిడి, తదితర గ్రామాల్లో శ్రీకృష్ణుడికి పూజలు జరిపి, చిన్నారులు ఉత్సాహంగా ఉట్టికొట్టారు.



మోదుమూడిలో..



కూచిపూడి అగ్రహారంలో



చల్లపల్లిలో...



పామర్రులో...

కేంద్ర నిధులతో పెడన సమస్యలు పరిష్కరిస్తా



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ బాలశౌరి

పెడన, ఆగస్టు 26 : కేంద్ర ప్రభుత్వ నిధులు తీసుకువచ్చి పెడన సమస్యలు పరిష్కరిస్తానని ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌తో కలిసి పట్టణ సమస్యలపై ఏఎంసీ సమావేశపు హాలులో మునిసిపల్ అధికారులు, సచివాలయ ఉద్యోగులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. బాలశౌరి మాట్లాడుతూ, మురుగునీటిని శుద్ధి చేసి మంచినీరుగా మార్చే ప్లాంట్ నిర్మాణానికి పట్టణంలో 40 సెంట్ల స్థలం అందుబాటులో ఉందన్నారు. కంపోస్టు యార్డు ఏర్పాటు చేసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. రాష్ట్రం నుంచి నిధులు వచ్చే అవకాశం లేకపోవడంతో కేంద్ర నిధులు తీసుకురావాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ఏడుగురు ఎమ్మెల్యేలతో కలిసి తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని బాలశౌరి పేర్కొన్నారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, పెడన పట్టణం, పెడన రూరల్ మండలాలు తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నాయన్నారు. పట్టణంలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేదన్నారు. సీవరేజి ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణంతో మురుగునీటి సమస్య పరిష్కారమవుతుందని కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, మునిసిపల్ మాజీ చైర్మన్ అబ్దుల్ ఖయూం, కమిషనర్ మన్నం గోపాలరావు, జడ్పీటీసీ సభ్యుడు అర్జా వెంకట నగేష్, కూటమి నాయకులు శలపాటి ప్రసాద్, పంచకర్ల సురేష్, వహబ్‌ఖాన్, వరుదు రామకృష్ణ, శీరం ప్రసాద్, మట్టా శివపావని, బళ్ళ పద్మావతి పాల్గొన్నారు. అనంతరం బాలశౌరి, కృష్ణప్రసాద్ లంకలకలవగుంటలోని రక్షిత మంచినీటి పథకాన్ని పరిశీలించారు.

మదర్ థెరెస్సా సేవలు స్ఫూర్తిదాయకం



మచిలీపట్నం టౌన్, ఆగస్టు 26 : మదర్ థెరెస్సా సేవలు స్ఫూర్తిదాయకమని మదర్ థెరెస్సా సేవా సమితి అధ్యక్షుడు పైడిపాముల గురుప్రసాద్ అన్నారు. మదర్ జయంతి సందర్భంగా సోమవారం చిలకలపూడి సెంటర్‌లోని మదర్ థెరెస్సా విగ్రహం వద్ద రోగులకు దుస్తులు, పౌష్టికాహారం, దుప్పట్లు పంపిణీ చేశారు. రాధా రంగా మిత్ర మండలి అధ్యక్షుడు బుల్లెట్ ధర్మారావు, కార్యవర్గ సభ్యులు పద్మనాభుని శేఖర్, లంకే నాంచారయ్య, హర్ష తదితరులు పాల్గొన్నారు. **ఘంటసాల :** దేవరకోట ఎంపీపీ స్కూల్‌లో మదర్ థెరెస్సా జయంతిని మదర్ సేవా సమితి అధ్యక్షుడు కొడాలి శ్యామ్యూల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మదర్ థెరెస్సా విగ్రహానికి దేవరకోట సర్పంచ్ మద్దాల వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు కొప్పుల రాములమ్మ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మాజీ సర్పంచ్‌లు పుట్టి వెంకటేశ్వరరావు, బోలెం శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ పరిశె సాంబశివరావు, వార్డుసభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు. **అవనిగడ్డ :** గాంధీ క్షేత్రంలో మదర్ థెరెస్సా చిత్రపటానికి మండలి వెంకట్రామ్ పూలమాల వేసి నివాళులర్పించారు. కొల్లూరి వెంకటేశ్వరరావు, శేషుబాబు, బండ్రెడ్డి రాఘవ, బచ్చు రఘునాథ్ ప్రసాద్, ఘంటసాల రాజమోహన్‌రావు ల్గొన్నారు. **అవనిగడ్డ రూరల్ :** శ్రీరామా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యామ్ కిషక్షర్ నాయుడు ఆధ్వర్యంలో ఏరియా ఆసుపత్రి ఎదుట మదర్ థెరెస్సా విగ్రహానికి నివాళులర్పించారు. బీపీఎల్.ప్రసాద్, దామెర్ల నాగరాజు, మునిపల్లి వెంకటేశ్వరరావు, పాస్టర్ ప్రసాద్, సాయి ఫణీంద్ర పాల్గొన్నారు. **కోడూరు :** మదర్ థెరెస్సా జయంతిని కోడూరు సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ వైద్యశాలలోని రోగులకు రొట్టెలు పంపిణీ చేశారు. వైద్య సిబ్బందికి శాలువా కప్పి మదర్ చిత్రపటాలు అందజేశారు. బండే శ్రీనివాసరావు, మర్రె గంగయ్య, ఉల్లి శేషగిరిరావు, కోట రాంబాబు, పిల్లి మల్లిఖార్జునరావు, ముద్దినేని చంద్రరావు, గోగినేని సోమశేఖరరావు, వేముల వెంకటేశ్వరరావు, వేముల వేలాద్రి, అప్పికట్ల రవీంద్ర, వేములపల్లి శ్రీకృష్ణ, జరుగు ఆదినారాయణ, అద్దంకి పాండురంగారావు, టీఎస్ఆర్ గ్రూపు సభ్యులు పాల్గొన్నారు. **గుడివాడ :** సామాజికవేత్త మాచర్ల రామకృష్ణ(ఆర్.కె) ఆధ్వర్యంలో పేదలకు భోజన వసతి కల్పించారు. తుమ్మలరాంబ్రహ్మం పార్కులోని మదర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళులర్పించారు. శివ, చరణ్, రాజా, శ్యామ్ పాల్గొన్నారు. **గుడ్లవల్లేరు :** లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మదర్ థెరెస్సా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. దాతగా అడుసుమిల్లి వెంకట రమణారావు వ్యవహరించారు. క్లబ్ అధ్యక్షురాలు ఎస్.శశికళ, వైపిసి ప్రసాద్, కె.రాధాకృష్ణ, సిహెచ్ రాజా,పి. చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమాల్లో అన్నదానం

చల్లపల్లి : సేవా మూర్తి మదర్ థెరెస్సా 114 జయంతి, చల్లపల్లి లయన్స్‌క్లబ్ సభ్యుడు గోవిందరాజుల అశ్వినీకుమార్ తల్లిదండ్రులు జి.దుర్గా నాగేశ్వరరావు - జయలక్ష్మి భారతి జ్ఞాపకార్థం చల్లపల్లిలోని సీయోను, ఆదరణ వృద్ధాశ్రమాల్లో చల్లపల్లి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అశ్వినీకుమార్ సహకారంతో అన్నదానం జరిగింది. క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు రాయపాటి రాధాకృష్ణ, కస్తూరి వెంకటవర ప్రసాద్, నర్రా సాయిబాబు, తగిరిశ సాంబశివరావు, ఎం.వెంకటేశ్వరరావు, సాంబశివరావు, ఏఎల్ఆర్‌కె.ప్రసాద్, కంఠంనేని సుధాకర్, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ రాజేశ్వరికి పతీవియోగం

అవనిగడ్డ : అవనిగడ్డ మాజీ ఎంపీపీ సింగం రాజేశ్వరికి పతీవియోగం కలిగింది. రాజేశ్వరి భర్త సింగం పరిపూర్ణానందరావు ఆదివారం రాత్రి మోదుమూడిలో మృతి చెందారు. పరిపూర్ణానందరావు భౌతికకాయాన్ని ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్ సందర్శించి నివాళులర్పించారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, మిక్కిలినేని మధు, నాయకులు, గ్రామ పెద్దలు పుష్పాంజలి ఘటించారు.

పెద్ద శివాలయానికి విరాళం

గుడివాడ : పార్వతీ సమేత భీమేశ్వరస్వామి దేవస్థాన అభివృద్ధి పనుల నిమిత్తం సోమవారం కోట వేమన చంద్రశేఖర్, ఆయన కుమారులు రూ.10,116 విరాళాన్ని ఈవో నటరాజన్ షణ్ముగానికి అందజేశారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని యువకుడి మృతి



గుడివాడ : గుడివాడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో నిడమానూరు-ఉప్పులూరు రైల్వే స్టేషన్ మధ్య ఆదివారం రాత్రి 8గంటల సమయంలో విజయవాడ-నరసాపురం రైలు ఢీకొని గుర్తు తెలియని యువకుడు (20) తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందాడు. మృతి చెందిన యువకుడి ఆచూకీ తెలిసిన వారు గుడివాడ రైల్వే ఎస్సై నెం. 94406 27570కు సమాచారం అందించాలని కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

మర్రివాడ (పమిడిముక్కల) : మర్రివాడలో పేకాట శిబిరంపై దాడి చేసి 19 మందిని అరెస్టు చేసినట్టు ఎస్సై బి.శ్రీను తెలిపారు. పేకాటరాయుళ్ల వద్ద రూ.1,31,020 నగదు 11 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

మహిళ, ఇద్దరు విటుల అరెస్టు

మచిలీపట్నం టౌన్ : చాకిరేవుపాలెంలో వ్యభిచార గృహం నిర్వహిస్తున్న మహిళ, ఇద్దరు విటులను ఆర్‌పేట పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఆర్‌పేట సీఐ సాయిబాబు మీడియాకు అందించిన వివరాలిలా ఉన్నాయి. చాకిరేవుపాలెంలోని అద్దె ఇంట్లో బలరాముని పేటకు చెందిన మహిళ వ్యభిచార గృహం నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడం తో దాడి చేయగా కాకర్లమూడికి చెందిన పరసా ఉదయ్, ఉయ్యూరుకు చెందిన శివరామకృష్ణ ఇద్దరు విటులను, మహిళను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపామన్నారు. వ్యభిచార గృహ నిర్వాహకుల నుంచి రూ.1000 స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు.

గంగానమ్మ జాతరలో ఎమ్మెల్యే రావి

గుడివాడ : కాకర్ల వీధిలో సోమవారం జరిగిన గంగానమ్మ జాతరలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు జగన్మోహనరావు, వెనిగండ్ల రామకృష్ణ, ముళ్ళపూడి రమేష్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వార్డు అధ్యక్షుడు అల్లాడ శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు మొండేటి భోగీ, గణపతి శివశంకర్, సుధాకర్, జొన్నల శోభన్, చుక్క సత్యనారాయణ, కస్తూరి వెంకటేష్, అల్లాడ హరి, సుంకర శ్రీను తదితరులు పాల్గొన్నారు.